




'వంశధార' షట్టర్ల కుంభకోణం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. షట్టర్లు, కాలినడక వంతెనల సామగ్రి కొనుగోలులో వంశధార అధికారులు రూ.73కోట్ల భారీ అవినీతికి పాల్పడ్డారు. ఈ కేసును తొలుత విజిలెన్స్, తరువాత సీఐడీకి అప్పగించారు. ఈ కుంభకోణంలో 73మంది అధికారులు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేల్చారు. కుంభకోణం వెలుగులోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయింది. కేసులు ఎదుర్కొంటున్న అధికారుల్లో కొందరు మృతిచెందగా, మరికొందరు పదవీ విరమణ పొందారు. అసలు ఈ కుంభకోణం పాపం ఎవరిదో ఇంకా తేలలేదు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నడుస్తోంది. సీజ్ చేసి గోదాములో ఉంచిన సామగ్రి తుప్పు పట్టిపోతోంది. మరోపక్క పనులు నిలిచిపోయి రైతులకు సాగునీరు సమస్య వెంటాడుతోంది.


టెక్కలి సమీపంలో వంశధార కాలువపై పనిచేయని షట్టర్

హరిదాసుపురం సమీపంలో వాక్‌వే వంతెన దుస్థితి

ఈ పాపం ఎవరిది?

- వంశధార షట్టర్ల కుంభకోణానికి 15 ఏళ్లు
- రూ.73కోట్ల అవినీతి
- 2009లో విజిలెన్స్, 2011లో సీఐడీకి కేసు అప్పగింత
- అక్రమాల్లో 73 మంది అధికారులు, సిబ్బంది పాత్ర
- నేటికీ కొనసాగుతున్న కేసు

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):

'వంశధార... జిల్లా ప్రజల జీవనాడి. జిల్లాలో లక్షా 48వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 1977లో వంశధార ఎడమ కాలువను నిర్మించారు. హిరమండలం గొట్టాబ్యారేజీ నుంచి మొదలై వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి వరకు 12 మండలాలు, 398 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ 104.826 కిలోమీటర్ల పొడవున కాలువ తవ్వారు. 2,480 క్యూసెక్కుల సాగునీరు విడిచిపెట్టేలా డిజైన్ చేశారు. దీనికోసం రూ.109కోట్లను అప్పట్లో ఖర్చు చేశారు. అయితే, కాలువ వెంబడి పలుచోట్ల షట్టర్లు, కాలినడక (వాక్‌వే) బ్రిడ్జిలు అవసరమని 2009లో అప్పటి వంశధార ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. వాక్‌వే వంతెనకు రూ.2లక్షల నుంచి రూ.6లక్షల వరకు, షట్టర్లకు సంబంధించి డయామీటర్ ప్రకారం రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకు ఉండేలా ధరలను నిర్ణయించారు. మొత్తం 2,036 పనులకు గాను రూ.73.8 కోట్లతో అప్పటి వంశధార ఇంజనీరింగ్ అధికారులు గుడ్డిగా ప్రతిపాదనలు తయారు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ దీని టెండర్లు పొందారు. షట్టర్లకు సంబంధించి స్క్రూరాడ్లు, రెంచ్‌లు, సీటీ యాంగిలర్లు వంటి సామగ్రి ఉండేలా టెండర్లలో పొందుపరిచారు. వీటిని విజయవాడలోని ఓ వర్క్‌షాపులో కొనుగోలు చేశారు. ఈ వర్క్‌షాపు ఎవరిదో కాదు. అప్పటికే వంశధారలో పదవీ విరమణ పొందిన ఓ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ అధికారిది. ఆయన ఎస్‌ఈగా ఉన్నప్పుడు పాత తేదీలు వేసి షట్టర్లు, కాలినడక వంతెనలకు అవసరమైన సామగ్రిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించి భారీ అవినీతికి పాల్పడ్డారు. దీంతో అప్పటి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. నరసన్నపేట కేంద్రంగా ఈ కుంభకోణానికి తెరలేపగా, టెక్కలి వంశధార డివిజన్ స్థాయి అధికారుల భాగస్వామ్యం ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

సిబ్బంది పాత్ర..

ఈ కుంభకోణంలో సీఈ, ఈఈలు, డీఈఈలు, ఏఈలు, జేఈలు, డ్రాఫ్స్‌మెన్లు, సూపరింటెండెంట్లు, మేనేజర్లు, గుమస్తాలు (మిగతా 8వ పేజీలో..)

సమాచారం


కంచిలి: అంపురం వద్ద అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

1న జిల్లాకు సీఎం రాక?

- సిక్కోలు నుంచే ఉచిత గ్యాస్ పంపిణీకి శ్రీకారం
- స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే అశోక్, అధికారులు

సోంపేట/ కంచిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సీఎం చంద్రబాబు నాయుడు నవంబరు 1న జిల్లాకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. సిక్కోలు నుంచే ఉచిత గ్యాస్ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. ఈ మేరకు సీఎం పర్యటన సభాస్థలి, హెలీప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారు. ఆదివారం రాత్రి సోంపేటలోని జూనియర్ కళాశాల మైదానం, కొర్లాం ప్రాంతాలతోపాటు.. కంచిలి మండలం మఖరాంపురం, అంపురంలో స్థలాన్ని ఎమ్మెల్యే అశోక్, అధికారులు పరిశీలించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో సోంపేట సీఐ మంగరాజు, కూటమి నేతలు మాదిన రామారావు, తమరాల శోభన్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. సీఎం పర్యటనకు సంబంధించి అధికారికంగా షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

బీసీ వసతిగృహాల్లో డిజిటల్ బోధన

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి
- జిల్లాలో తొలివిడత ఐదుచోట్ల ఏర్పాటు


బీసీ వసతిగృహంలో ట్యూటర్ పర్యవేక్షణలో చదువుతున్న విద్యార్థులు

నరసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతోపాటు సాంకేతిక విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం డిజిటల్ రిసోర్సు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. దివంగత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ పేరుతో ఈ కేంద్రాలను నెలకొల్పనుంది. ఈ కేంద్రాల్లో తొలివిడతగా 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు బోధన చేపట్టనున్నారు. అందుకోసం సొంత భవనాలు, విశాలమైన గదులు ఉన్న వసతిగృహాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

● జిల్లాలో 79 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 7వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. 61 వసతిగృహాల్లో పాఠశాల విద్యార్థులు ఉంటున్నారు. 18 వసతి గృహాల్లో పోస్టుమెట్రిక్ విద్యార్థులు చదువుతున్నారు. తొలివిడతగా ఐదు వసతిగృహాల్లో డిజిటల్ రిసోర్సు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. లావేరు, సింగుపురం, కోటబొమ్మాళి, నందిగాం, కంచిలి బాలుర వసతిగృహాలను అధికారులు ఎంపిక చేశారు. వీటిలో 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులు 570 మంది ఉన్నారు. వీటి పరిధిలో మరో 15 వసతిగృహాలు ఉండగా.. ఆయా విద్యార్థులు కూడా ఈ కేంద్రాలను వినియోగించుకోనున్నట్లు బీసీ వెల్ఫేర్ అధికారిణి అనూరాధ తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 14న వీటిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో రెండో విడతలో మరికొన్ని వసతిగృహాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

● ట్యూటర్ల ద్వారా సందేహాల నివృత్తి

ఎంపిక చేసిన వసతిగృహాల్లో ఒక గదిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. అందులో డిజిటల్ ఇంటిరాక్టివ్ బోర్డు, సమాచారాన్ని పెన్‌డ్రైవ్ ద్వారా అందిస్తారు. పాఠశాల ముగిసిన తర్వాత వసతిగృహాలకు చేరుకున్న విద్యార్థులకు సబ్జెక్టులో బోధనతోపాటు సందేహాల నివృత్తికి ట్యూటర్లను నియమించనున్నారు. ఈ కేంద్రాల్లో లాంగ్వేజ్‌లతో పాటు సాంఘీక శాస్త్రంలో మ్యాప్‌లను గుర్తించేందుకు బోధన ఎంతో దోహదపడుతుంది. అలాగే సైన్సులో సులువుగా బొమ్మలను గీయడం.. ప్రయోగాల ద్వారా సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆన్‌లైన్‌లో కూడా అదనపు సమాచారం పొందేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయి. తద్వారా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదన పంపించాం



జిల్లాలో మొదటి విడతలో ఐదు వసతిగృహాలను ఎంపిక చేసి.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రీమెట్రిక్ హాస్టల్‌లో సొంత భవనాలు ఉన్న ఐదుచోట్ల డిజిటల్ రీసోర్సు సెంటర్లు ఏర్పాటు చేస్తాం.

-ఈ. అనురాధ, బీసీ సంక్షేమ అధికారిణి

న్యూస్ బాక్స్

నవంబరు నుంచి నైపుణ్య గణన

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైపుణ్య గణనకు నవంబరు మొదటి వారం నుంచి శ్రీకారం చుడుతున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇందుకు సంబంధించి ఈ నెల 29న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి శిక్షణ నిర్వహిస్తాం. మాస్టర్ ట్రైనర్ల ఎంపిక పూర్తయింది. పూర్తిస్థాయి శిక్షణ అనంతరం వారంతా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. సంబంధిత వివరాలు నైపుణ్యం అనే యాప్ ద్వారా సేకరిస్తారు. పరిశ్రమల అవసరాలు, మానవ వనరుల వివరాలు బేరీజు వేసుకుని తగిన ప్రణాళికలు రూపొందించడానికి ఉపయోగపడుతుంది. జిల్లాలో 15 నుంచి 59 ఏళ్ల మధ్య నైపుణ్యం గల వ్యక్తుల వివరాలు సేకరించి, తద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం. ఈ గణన పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా ఉపాధి అధికారులను నోడల్ అధికారులుగా నియమించాం. సచివాలయ సిబ్బందిని ఇందులో భాగస్వాములు చేస్తున్నామ'ని కలెక్టర్ పేర్కొన్నారు.


దేవరవలస వద్ద మడ్డువలస కాలువ దుస్థితి

'మడ్డువలస'.. నీరేదీ?

- సాగునీరు అందక.. ఎండిపోతున్న వరి పంటలు
- ఆందోళనలో రైతులు

జి.సిగడాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మడ్డువలస జలాశయం పరిధిలోని రైతులు సాగునీరు అందక అగచాట్లకు గురవుతున్నారు. ప్రస్తుతం వరిపైరు పొట్టదశలో ఉండడంతో పుష్కలంగా నీరు అవసరం. కాగా.. వర్షాలు లేక.. మడ్డువలస కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందక వరిపైరు ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. జి.సిగడాం మండలంలోని ఆనందపురం, ఆబోతులపేట, పెంట, నాగులవలస, జాడ, వాండ్రంగి, వెలగాడ, చంద్రయపేట, దేవరవలస, మంగంపేట, చెట్టుపొదిలాం, మదుపాం, మెట్టవలస, పాలఖండ్యాం, సంతవురిటి, దవలపేట, నల్లిపేట తదితర గ్రామాల్లో రైతులు మడ్డువలస జలాశయం పరిధిలో సుమారు పదివేల ఎకరాలకుపైగా వరిసాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచీ వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సెప్టెంబరు నుంచీ ఈ ప్రాంతంలో సగటు వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరి పంటకు నీరందని పరిస్థితి నెలకొంది. ఇటీవల దానా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తాయని.. ఆశించినా నిరాశే మిగిలిందని రైతులు వాపోతున్నారు. సాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం (మిగతా 8వ పేజీలో..)


సంతవురిటిలో పొట్టదశలో ఎండుతున్న వరి పంట

గజ్జె కట్టి చిందేస్తే..

- తప్పెట గుళ్లు.. భజనలకు కేరాఫ్‌గా అడవినారాయణవలస
- ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలు

8లో

రాత్రిపూట గుట్టుగా..

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- విశాఖకు తరలింపు
- దాడులు చేస్తున్న ఆగని వైనం



8లో



గిరిజన గ్రామాలకు మహర్దశ

- మెళియాపుట్టి మండలం దబ్బగుడ్డి గ్రామంలో 30 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. గ్రామానికి రహదారి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక విద్యార్థులు చదువుకు నేందుకు.. రోజూ కొండ దిగి రెండు కిలోమీటర్ల మేర నడిచి.. పెద్దకేదారి పాఠశాలకు వెళ్తున్నారు. రహదారి సౌకర్యం లేక ఆపసోపాలు పడుతున్నారు.

- మెళియాపుట్టి మండలం గొడ్డ గ్రామం జంక్షన్ నుంచి అంపురం వరకు రహదారి అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థులు అవస్థలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పీఎం జన్‌మన్ నిధులు మంజూరు చేయడంతో సుమారు ఎనిమిది గ్రామాల గిరిజనులకు రహదారి సౌకర్యం కలుగనుంది.

- పీఎం జన్‌మన్ నిధులతో అభివృద్ధి
- మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

మెళియాపుట్టి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. ఇప్పటివరకూ మౌలిక సదుపాయాల కల్పనకు దూరంగా ఉన్న గ్రామాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులు ఐదేళ్లుగా దారి మళ్లించడం వల్ల గ్రామాలకు రహదారితో పాటు మౌలిక సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం గిరిజన గ్రామాలు అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో పీఎం జన్‌మన్ పథకం ప్రారంభించింది. ఈ పథకం కింద గుర్తించిన గ్రామాల్లో సభలు నిర్వహించి.. సమస్యలు గుర్తించి నివేదికలు తయారుచేశారు. ప్రధానంగా రహదారులు, తాగునీరుతోపాటు విద్యుత్ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. దీనిలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 998 గిరిజన గ్రామాలు ఉండగా.. తొలివిడత 43 గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నిధులు మంజూరు చేయనున్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా గిరిజన గ్రామాలకు తొలివిడతలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తారు. ఇళ్ల మంజూరుతోపాటు రహదారి, ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. వైద్యసేవలతోపాటు ఆయుష్మాన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయనున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 25 రకాల అభివృద్ధి పనులు చేయడానికి ముందుకువచ్చింది. ఈ మేరకు (మిగతా 8వ పేజీలో..)



గజ్జెకట్టి చిందేస్తే..

- తప్పెట గుళ్లు.. భజనలకు కేరాఫ్‌గా అడవినారాయణవలస
- ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన
- ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ ప్రత్యేక గుర్తింపు
- ధనుర్మాసంలో మేలుకొలుపులు

నరసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామ యువకులు గజ్జె కట్టి తప్పెట గుళ్ల ప్రదర్శనతో చిందేస్తే చూపరులు మంత్రముగ్ధులవ్వాల్సిందే. వారి నైపుణ్యంతో జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆ గ్రామానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. మరోవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ వేలాది ప్రదర్శనలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నరసన్నపేట పట్టణానికి సమీపంలో ఉన్న కరగాం పంచాయతీ అడవినారాయణవలస గ్రామం ఆధ్యాత్మికంగా విరాజిల్లుతోంది. ఈ గ్రామంలో 130 కుటుంబాలు ఉన్నాయి. ప్రతీ ఇంటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రతి రోజూ ఉదయం 4గంటలకే ఆ గ్రామంలో సుప్రభాతం వినిపిస్తుంది. ఆ తర్వాత ఆంజనేయస్వామి, అమ్మతల్లి ఆలయాలు వద్ద భజన, తప్పెటగుళ్ల వంటివాటితో భగవంతున్ని కీర్తించడం గ్రామస్థుల దినచర్య. ఆ దినచర్యతో ప్రారంభించిన భజన, తప్పెటగుళ్లు.. నేడు జిల్లాలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చేలా చేసి.. గ్రామానికి గుర్తింపు తెచ్చారు.


మేలుకొలుపులో భజన బృందం (ఫైల్)

తప్పెటగుళ్లతో.. పేరు

అడవి నారాయణవలసలో 50 ఏళ్ల కిందట తప్పెట గుళ్ల ప్రదర్శనను కొందరి యువకులు నేర్చుకున్నారు. ఖాళీ సమయంలో గ్రామంలో కాలక్షేపానికి ఇచ్చే ప్రదర్శనలు.. అప్పట్లో జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల్లో పలుమార్లు ప్రదర్శించేవారు. ప్రస్తుత యువత కూడా దీన్నే వారసత్వంగా తీసుకుని తప్పెటగుళ్లు నేర్చుకున్నారు. గత పదేళ్లుగా శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో, శివరాత్రి సమయాల్లో నిర్వహించే జాతరల్లో పలు ప్రదర్శలు ఇస్తూ అంతరించిపోతున్న సిక్కోలు సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్నారు. జిల్లాలో ఎక్కడ పండగలైనా.. జాతరలైనా.. తప్పెటగుళ్ల ప్రదర్శన పేరు ఎత్తితే.. ముందుగా అడవినారాయణవలస గ్రామస్థులే గుర్తుకురావడం గమనార్హం.


శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న తప్పెటగుళ్ల బృందం(ఫైల్)

దశాబ్దాలుగా..

అడవినారాయణవలస భజన బృందాలు మూడు దశాబ్దాలుగా పలు ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఏటా తిరుమలలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తప్పెట గుళ్ల ప్రదర్శనలు ఇస్తే... మిగతా సమయాల్లో భజన బృందాలు నాదనీరాజనం కార్యక్రమంలో పాల్గొని శ్రీవారి సంకీర్తనలు ఆలపిస్తారు. ఏకాదశి పర్వదినాల్లో గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద 24 గంటలు అఖండ భజనలు చేస్తారు. నరసన్నపేట, జలుమూరు, గార, శ్రీకాకుళం రూరల్ తదితర మండలాల్లో ఏటా ముక్కోటి ఏకాదశి, కార్తీక ఏకాదశి వంటి పర్వదినాల్లో భజనలు చేస్తారు. ధనుర్మాసంలో 30 రోజులపాటు రోజుకో గ్రామంలో మేలుకొలుపు నిర్వహిస్తుంటారు. తెల్లవారు జామున 4 గంటలు నుంచి ఉదయం 6.30 నగర సంకీర్తన చేస్తుంటారు. ధనుర్మాసంలో చేసే మేలుకొలుపు ద్వారా వచ్చిన బియ్యంతో సంక్రాంతి తర్వాత పేదలకు నారాయణసేవ కార్యక్రమం నిర్వహిస్తారు.

సంస్కృతికి జీవం పోయాలనే..



గ్రామీణ సంస్కృతికి జీవం పోయాలనే లక్ష్యంతోనే.. ప్రదర్శనలు చేస్తున్నాం. తప్పెట గుళ్ల గ్రామీణ జానపద సంస్కృతి మూలం. ఆనాటి జీవన విధానాలు.. హైందవ సంస్కృతిని ఇనుమడింప చేయడంలో కీలక పాత్ర వహిస్తాయి. ఉత్తరాంధ్ర సంప్రదాయానికి ప్రతీక తప్పెటు గుళ్ల నిలుస్తున్నాయి.

- శిమ్మ లక్ష్మణరావు, తప్పెటగుళ్ల బృంద ఆర్గనైజర్, నారాయణవలస

భావితరాలకు అందించాలని..



ఈ సంస్కృతి, సంప్రదాయం భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. కొత్తగా నేర్చుకునేందుకు యువత ముందుకు వస్తే బాగుంటుంది. తప్పెట గుళ్ల కళింగ సంస్కృతికి ప్రతీక. ఒకనాడు యాదవ జాతిలో ఉండే సంప్రదాయం నేడు అందరూ ఆదరిస్తున్నారు. నేటి యువత దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

- చిన్నాల లోకనాథం, తప్పెటగుళ్ల గురువు, నారాయణవలస

ఈ పాపం ఎవరిది?

(ఏడో పేజీ తరువాయి)

ఇలా 73 మంది అధికారులు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు అప్పట్లో విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నరసన్నపేట కేంద్రంగా అగ్రిమెంట్‌కు అవసరమైన స్టాంప్ పేపర్ల కిరికిరిని ముందుగా గుర్తించి లోతుగా విచారణ చేపట్టారు. తీగ లాగుతున్న కొద్దీ డొంక బయటపడుతుండడంతో 2011లో ఈ కేసును సీబీడీకి అప్పగించారు. అప్పటికే విజిలెన్స్ అధికారులు రూ.8కోట్లు కాంట్రాక్టర్ నుంచి, మరో రూ.8కోట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. సుమారు 1,500 టన్నులు షట్టర్లు, వాక్‌వే బ్రిడ్జి సామగ్రిని సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని సీజ్ చేసి టెక్కలి, నరసన్నపేట, సీటీపేట, శ్రీముఖలింగం, కోటబొమ్మాళి, హిరమండలం ప్రాంతాల్లోని గోదాముల్లో ఉంచారు. ఈ సామగ్రి తుప్పు పట్టిపోతోంది. మరికొంత సామగ్రి దొంగల పాలైనట్లు ఏడాది కిందట వంశధార ఈఈ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నలుగుతున్న కేసు..

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి నీటిపారుదల శాఖా మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదాముల్లో మగ్గుతున్న షట్టర్లు, వాక్‌వే బ్రిడ్జి సామగ్రిలో సుమారు 900టన్నుల వరకు వేలం వేయాలని ప్రతిపాదించారు. అయితే, ఈ కేసు సీఐడీ పరిధిలో ఉండడం, కొందరు సిబ్బంది కోర్టును ఆశ్రయించడంతో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఈ కేసులో ఇరుకున్న అధికారుల్లో కొందరు మృతిచెందగా, మరికొందరు పదవీవిరమణ పొందారు. ఇంకొందరు కోర్టును ఆశ్రయించి ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నలుగుతోంది.

తప్పని సాగునీటి సమస్య..

షట్టర్ల కుంభకోణం మూలంగా గత 15 ఏళ్లుగా ఈ కాలువ వెంబడి కొత్త షట్టర్లు, వాక్‌వే బ్రిడ్జిల నిర్మాణం జరగలేదు. ఫలితంగా శివారు ప్రాంత రైతులకు సాగునీటి సమస్య తప్పడం లేదు. ఈ కుంభకోణంపై జిల్లాకు చెందిన టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధులు నోరుమెదపని పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై మాట్లాడకుండా ఉండేందుకు వంశధార అధికారులు కొందరు పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ షట్టర్ల కుంభకోణాన్ని పూర్తిస్థాయిలో బయటకు తీసి, సాగునీటి సమస్య తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి..

షట్టర్లు, వాక్‌వే వంతెనల సామగ్రిని సీఐడీ అధికారులు అప్పట్లో సీజ్ చేసి పలు గోదాముల్లో ఉంచారు. ఈ కేసుకు సంబంధించి కొందరు సిబ్బంది, కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించారు. కాలువ వెంబడి షట్టర్లు, వాక్‌వే వంతెనల అవసరం గుర్తించాం. సీఈ స్థాయి అధికారికి ప్రతిపాదనలు చేశాం. దీనిపై టెక్నికల్ కమిటీ వేయాల్సి ఉంది. ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- స్వర్ణకుమార్, ఎస్ఈ, నీటిపారుదల శాఖ

'మడ్డువలస'.. నీరేదీ?

(ఏడో పేజీ తరువాయి)

లేకపోతోందని ఆవేదన చెందుతున్నారు. జి.సిగడాం మండలంలో నాగులవలస వద్ద ప్రారంభమైన మడ్డువలస కుడిప్రధాన కాలువ.. 16 గ్రామాల మీదుగా నల్లిపేట చెరువు వరకు నీరందుతుంది. కాగా.. దేవరవలస, మంగంపేట, వాండ్రంగి, బొట్టపేట తదితర గ్రామాల్లో కాలువ 56 అడుగుల లోతులో ఉండడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. వర్షాభావంతో పొలాలు బీటలు వారుతుండడంతో .. చెరువుల్లో ఉన్ననీటిని ఇంజిన్లు ద్వారా పైరుకు అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మడ్డువలస కాలువ ద్వారా నీరు అందించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి



మా గ్రామంలో మడ్డువలస కాలువ ద్వారా సాగు నీరు రావడం లేదు. సాగునీటి కోసం పలు మార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. అన్నదాతల కష్టాలను దృష్టిలో పెట్టుకొని మడ్డువలస కాలువ ద్వారా సాగునీటిని అందించాలి.

- సీహెచ్‌ఆర్‌కే రంగారావు, రైతు, సంతవురిటి

పంటలు ఎండుతున్నాయి



మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో వరి పంట పొట్టదశలో ఎండిపోతోంది. ఇంజన్లతో నీరు తోడి పంటలను కాపాడుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సాగునీటిని విడుదల చేయాలి.

- మీసాల సూరిబాబు, రైతు, పెంట

గిరిజన గ్రామాలకు మహర్దశ

(ఏడో పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు మంజూరు చేయనున్నాయి. ఏజెన్సీలో 43 గ్రామాలను ఎంపిక చేసి.. ప్రణాళికలు సిద్ధం చేశామని సీతంపేట ఐటీడీఏ ఏపీవో చిట్టిబాబు తెలిపారు.

ఆశలు చిగురించాయి..



వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి మోసం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి అభినందనీయం.

- బైరిశింగి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి

పరిశ్రమల హబ్ ఎప్పుడో?

- గ్రానైట్ అనుబంధ పరిశ్రమలతో యువతకు ఉపాధి
- ఆరేళ్ల కిందట ప్రతిపాదనలు
- స్థల పరిశీలనకే పరిమితం

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి అనగానే అందరికీ గుర్తొచ్చేది నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ. ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఈ పరిశ్రమ ద్వారా కల్పించాలనే ప్రతిపాదన కనుమరుగైంది. గ్రానైట్ పరిశ్రమకు అనుబంధంగా కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్, స్టోన్‌క్రషర్, మోన్యుమెంట్ ఫ్యాక్టరీలు, పౌడర్‌తో యాష్‌బ్రిక్ వంటివి ఏర్పాటు చేయుటకు పరిశ్రమల హబ్ ఉపయోగపడుతుంది. ఆరేళ్ల కిందట టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ సర్వే నెం.1 అడ్డుకొండ ప్రాంతంలో పరిశ్రమల హబ్ ఏర్పాటుకు సుమారు వంద ఎకరాల స్థలం అవసరమని అప్పట్లో రెవెన్యూ అధికారులు దపదపాలుగా స్థల పరిశీలన చేశారు. ఈ ప్రాంతంలో గ్రానైట్‌కు అనుబంధంగా పలు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని అప్పట్లో పరిశ్రమల శాఖ అధికారులు కూడా చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాంతంలో పరిశ్రమల హబ్ ప్రతిపాదన అటకెక్కించారు. పదుల సంఖ్యలో గ్రానైట్ పరిశ్రమలు నెలకొల్పబడితే రవాణా రంగానికి, సాంకేతిక సామగ్రి అమ్మకందార్లకు, స్కిల్డ్ టెక్నీషియన్లకు, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరికే అవకాశముండేది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు పూర్తిగా మర్చిపోయారు. ఈ విషయమై జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. ఇటీవల కాలంలో అటువంటి ప్రతిపాదనలు ఏవీ రాలేదని ఆయన తెలిపారు.


గ్రానైట్ క్వారీ


గార మండలం దీపావళి జంక్షన్‌లో..


కంచిలి మండల కేంద్రానికి సమీపంలోని స్వర్గధామం వద్ద..

ఇలానే వదిలేస్తారా?

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రాలు అద్దం పడతాయి. ఎంతో ప్రమాదమని తెలిసినా ఇలా వదిలేస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. శ్రీకాకుళం నుంచి కళింగపట్నం వెళ్లే రహదారిలో గార మండలం దీపావళి జంక్షన్ వద్ద, కంచిలి మండల కేంద్రానికి సమీపంలోని స్వర్గధామం వద్ద గల విద్యుత్ స్తంభాలను ఇలా పిచ్చి మొక్కల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ ప్రాంతాల్లో నిత్యమూ విద్యుత్ అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏ ప్రమాదం జరగకముందే వీటిని తొలగించాలని ఆ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

- గార/ కంచిలి

రాత్రిపూట గుట్టుగా..

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- దాడులు చేస్తున్న ఆగని వైనం

నరసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని ఆసరాగా తీసుకొని కొందరు అక్రమార్కులు ఇసుక దందాలకు పాల్పడుతున్నారు. చీకటి పడితే చాలు ఈ అక్రమ రవాణాకు శ్రీకారం చుడుతున్నారు. ట్రాక్టర్లు నుంచి మైదాన ప్రాంతాలకు ఇసుక డంపింగ్ చేసి.. అక్కడ నుంచి విశాఖకు అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ తంతు నదీతీర గ్రామాలతో పాటు.. నరసన్నపేట పరిసర గ్రామాల్లో కూడా రాత్రి సమయాల్లో జోరుగా సాగుతుంది. గతంలో ఇసుక దందాకు పాల్పడినవారే ఇప్పుడు ముఠాగా ఏర్పడి దోచుకుంటున్నారు. ఉచిత ఇసుక విధానం ప్రభుత్వం ప్రకటించన తరువాత జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల్లో తోటలు, కళ్లాల్లో ఈ తంతాంగం నడిపిస్తున్నారు. విశాఖలో ఇసుక లారీ రూ.35 వేలు పలుకుతుంది. ఒక్కో లారీకి నాలుగేసి ట్రాక్టర్లు లోడింగ్ చేస్తున్నారు. లారీ ఇసుక లోడింగ్ చేసి.. జాతీయ రహదారి మీదకు మళ్లించేవరకు ఈ ముఠా సభ్యులే అంతా చూసుకుంటారు. ఒక్కొక్క లారీకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నారు. రోజుకు రెండు మూడు లారీ వరకు ఈ అక్రమ దందాకు శ్రీకారం చుడుతున్నారు. నరసన్నపేట మండలంలో అటు లుకలాం, చేనులవలస, బుచ్చిపేట, గోపాలపెంట, మడపాం, దేవాది, కోమర్తి, శ్రీకాకుళం రూరల్ మండలం బైరి, కరజాడ, నైర తదితర ప్రాంతాలు నుంచి రోజూ వందలాది లారీల్లో ఉచితం మాటున ఇసుక దందా సాగుతుంది. ఈ దందా వెనుక కొన్ని గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు కలిసే ఈ తంతాంగం నడిపిస్తున్నారు.


తనిఖీలు చేస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పట్టుకున్న అధికారులు

దేవాది గ్రామం వద్ద శనివారం రాత్రి ఒక మైదాన ప్రాంతంలో ట్రాక్టర్లతో డంప్ చేసిన ఇసుకను రాత్రి 11 గంటలు సమయంలో జేసీబీ సాయంతో లారీలకు లోడింగ్ చేస్తుండుగా తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. రెండు లారీలు, ఒక జేసీబీను సీజ్ చేశారు. వారం రోజుల కిందట కోమర్తి జంక్షన్ వద్ద ఒక రైస్ మిల్లు వద్ద ఉన్న ఇసుక పోగులను గుర్తించిన తహసీల్దార్ సత్యనారాయణ.. వాటిని సీజ్ చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

రబీకి బీమా.. రైతుకు ధీమా!

- అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం
- రైతు వాటాగా నామమాత్రపు ప్రీమియం
- ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల

హరిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చే రబీ సీజన్ (2024-25)కు పంటల బీమాకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఖరీఫ్‌లో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెలించి, సాగు చేసిన రైతులందరికీ వర్తించేలా చర్యలు తీసుకుంది. రబీలో రైతు వాటా కింద నామమాత్రపు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. జిల్లాలో సాగయ్యే రబీ పంటలన్నింటికీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తారు. జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, శనగ, వేరుశెనగ, వరి తదితర రబీ పంటలకు బీమా సౌకర్యం ఉంది. వరిని గ్రామ యూనిట్‌గా తీసుకొని అమలు చేస్తుండగా.. వేరు శనగను జిల్లా యూనిట్‌గా, మిగతా పంటలకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. రబీలో బ్యాంకుల నుంచి పంట రుణం తీసుకొన్నట్లయితే ప్రీమియం మినహాయించి బీమా సౌకర్యం కల్పిస్తారు. సొంత పెట్టుబడితో సాగు చేస్తే.. రైతులకు సంబంధించిన కామన్ సర్వీస్ కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు, సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం ఇస్తే బీమా సౌకర్యం కల్పిస్తారు. పంటల బీమాలో నమోదైన రైతులందరూ తప్పనిసరిగా ఇ-పంటలో వివరాలు నమోదు చేసుకోవాలి.

ఈ పంటలకు ప్రయోజనం..

జిల్లాలో అత్యధికంగా సాగయ్యే మినుము, పెసర, వేరుశనగతోపాటు ఉద్యానవన పంటలైన జీడి, మామిడి రైతులకు సాత్వన సమకూరనుంది. దీంతోపాటు వాణిజ్య పంటలపైనా ప్రభుత్వం దృష్టిసారించింది. నువ్వులు, ప్రొద్దుతిరుగుడుతోపాటు జొన్న, మొక్కజొన్న, వరి వంటి ప్రధాన పంటల సాగుచేస్తున్న రైతులకు రబీలో బీమా సౌకర్యం కల్పించారు. దీంతో జిల్లాలో సుమారు 1.2లక్షల హెక్టార్లలో సాగవుతున్న వివిధ పంటలకు ప్రయోజనం చేకూరనుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమాను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి. ముందుగా రైతులంతా ఈ-పాస్‌లో పంట వివరాలు నమోదు చేయించి నామమాత్రపు రుసుం చెల్లిస్తే చాలు.. జిల్లాలో దీనిపై పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తాం. దీనికోసం ప్రత్యేక ప్రణాళికతో ముదుకు సాగుతాం. జిల్లాలో ఉద్యానవన పంటలైన జీడికి హెక్టారుకు రైతు వాటాకింద రూ.4వేలు చెల్లిస్తే బీమా రూ.80వేలు లభిస్తుంది. దీనిపై పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి అధికారులతో అవగాహన కల్పిస్తాం.

- త్రినాథస్వామి, జేడీ, శ్రీకాకుళం

బీమా వివరాలు..

పంట	బీమా (ఎకరాకు)	రైతు వాటా(రూ.)
పెసర	18,000	45
మినుము	20,000	50
జొన్న	19,000	48
మొక్కజొన్న	38,000	114
శెనగ	28,000	70

పంటల బీమా తుది గడువు

వరి పంటకి: డిసెంబరు 31
మిగిలిన పంటలకు: డిసెంబరు 15



వరికి తెగుళ్ల బెడద

- కలవరపెడుతున్న పొడ తెగులు, సుడిదోమ
- ఆందోళన చెందుతున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతులు

కంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని రైతులను తెగుళ్లు కలవరపెడుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి వేలాది రూపాయలు అప్పులుచేసి పెట్టుబడులుపెట్టా రు. వరిపైరు పొట్టదశలో కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో సుడిదోమతోపాటు పొడ తెగులు ఆశించడంతో ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

కంచిలి మండలంలో 12 వేల ఎకరాలకు గాను ఈ ఏడాది 9646 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో సుమారుగా 1200 ఎకరాల్లో పంటకు సుడి దోమ, పొడ తెగులు ఆశించింది. సోంపేట మండలంలో తొమ్మిది వేల ఎకరాలకు గాను 1500 ఎకరాల్లో పంటకు తెగుళ్ల సోకాయి. కవిటి మండలంలో 9,200 ఎకరాలకు గాను పదిశాతం, ఇచ్ఛాపురం మండలంలో 7,800 పది నుంచి 15 శాతం వరకు తెగుళ్ల ఆశించాయి. పొడతెగులు ఆశించి వరిపైరు ఎండిపోతోంది. సుడిదోమ వల్ల రేకులు తెల్లగా మారి పంట దెబ్బతింటోంది. దీంతో కొద్దిరోజులుగా రైతులు పురుగు మందులు చల్లడంలో నిమగ్న మయ్యారు. ఈనేపథ్యంలో దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతపై అదనపు భారం..

తెగుళ్ల నివారణ రైతులకు అదనపు భారంగా మారుతోంది. సుమారుగా ఎకరానికి 10 వేల రూపాయలు ఖర్చు చేస్తుండగా తెగుళ్ల నివారణకు అదనంగా మరో రెండు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. తెగుళ్ల నివారణ మందులను కొనుగోలు చేసుకోవాలని సూచిస్తుండడంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది.



జింకిభద్రలో వరి పైరుకు పొడతెగులు ఆశించిన దృశ్యం

నివారణకు...

- ప్రస్తుతం వరి పంటను ఆశించి రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న సుడిదోమ నివారణకు ఎసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 20 ఎస్.జి 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- వీలైనంతవరకు పొలంలో తేమ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు కాలిబాటలు ఏర్పాటు చేస్తే, తగినంత వెలుతురు, గాలి సోకి తెగుళ్ల సోకకుండా నివారించవచ్చు.
- పంటకు తెగులు సోకిన వెంటనే సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించి, నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

ప్రస్తుతం తెగుళ్ల ఉధృతి తగ్గుముఖం పట్టిందని కంచిలి ఏవో ధనుంజయ తెలిపారు. రైతులకు సూచనలిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో అల్పపీడనం ఏర్పడునున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పొలాల్లో తేమ లేకుండా చూసుకోవాలని కోరారు. తెగుళ్లను గమనించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

తీవ్ర ఇబ్బందిపడుతున్నాం..



పంటకు తెగుళ్ల ఆశించడంతో తీవ్ర ఇబ్బందిపడుతున్నాం. ఇన్నాళ్ల వర్షాలు లేక, పంట చేతికొస్తుందో రాదో అని దిగులు చెందాం. ఇప్పుడు ఈ తెగుళ్ళు పంటను నాశనం చేస్తున్నాయి.

-జగన్నాథరావు, గొల్లకంచిలి

అప్పులపాలవుతున్నాం..



పంట వేసింది మొదలు ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ సాయం లేకపోగా ప్రస్తుతం తెగుళ్ల నివారణకు మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

-డొక్కరి నారాయణ, గొల్ల కంచిలి

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రాజశేఖర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

అరసవల్లి/శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆదిత్యుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో వై.భద్రాజీ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు నేతింటి హరిబాబు, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.కాగా తర్లాడ రాజశేఖర్‌ను ఆర్కేనగర్‌లోని ఆయన నివాసంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.87 లక్షలు

ఆదిత్యుని ఆలయంలో ఆదివారం రూ.3,87,124ల ఆదాయం లభించింది. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,18,700లు, విరాళాల ద్వారా రూ.50,849లు, ప్రసాదాల ద్వారా రూ.1,54,575ల ఆదాయం లభించినట్లు ఈవో భద్రాజీ తెలిపారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తీసుకోవాలి: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాలకు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో ఆదివారం కోరారు. జనావాసాలకు దూరంగా, విశాలమైన ప్రాంతాల్లో బాణసంచా విక్రయించాలని తెలిపారు. షాపునకు షాపునకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, డ్రమ్ములతో నీరు, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని బాణసంచా వ్యాపారులకు సూచించారు. అక్రమంగా బాణసంచా నిల్వలు, విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోంగార్డుకు మెరుగైన వైద్యం అందించాలి

శ్రీకాకుళంక్రైం/సరుబుజ్జిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హోంగార్డు రేవతికి మెరుగైన వైద్యమందించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. శనివారం సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో విధులు ముగించుకుని వస్తుండగా జొన్నలవలస వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళా హోంగార్డు తమ్మినేని రేవతిని శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఈమేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు రేవతిని ఎస్పీ పరామర్శించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు ఇమ్మాన్యుల్‌రాజు, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

సర్దుబాటు చార్జీల ప్రతిపాదన విరమించుకోవాలి

సోంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం కార్యవర్గ సభ్యుడు బి. తులసీదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సోంపేటలో సీపీఎం మండల మహాసభను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు దుంపల కృష్ణారావు, సంగారు లక్ష్మీనారాయణ, టి.పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తులసీదాస్

విశాఖ రైల్వేజోన్‌లో విలీనం చేయాలి

కంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఏర్పాటు చేస్తున్న రైల్వే జోన్‌లో సోంపేట(కంచిలి)రైల్వేస్టేషన్‌ను విలీనంచేయాలని రైల్వే వినియోగదారుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం కంచిలి రైల్వేస్టేషన్‌లో వినియోగదారుల సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైలునిలయంలో సమస్యలు పరిష్కరించాలని, డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కళింగ కోమటి సంఘం రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, ఉపాధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనంలో నగర కళింగ కోమటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారితో పాటుసభ్యులు ప్రమాణ స్వీకారంచేశారు. అనంతరం వారు కేంద్ర పౌరవిమా నయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిశారు. కళింగకోమట్ల ఓబీసీ సాధన కోసం, ఇతరసమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వి.సర్వేశ్వరరావు, అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, పీవీ రమణ, బరాటం శ్రీరామమూర్తి, ఎన్వీ శేషగిరి, ప్రసాద్, జామి.భీమశంకర్, బరాటం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిరాజు కోరారు. ఆదివారం ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ను విశాఖలో కలిశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభలు, పల్లె పండుగ కార్యక్రమాల ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజలకు చేరువయ్యారని తెలిపారు.

విద్యార్థుల్లో స్కిల్ నైపుణ్యం పెంపొందిస్తున్నాం

- సెంచూరియన్ యూనివర్శిటీ డీన్ ప్రఫుల్‌కుమార్ పండా



మాట్లాడుతున్న డీన్ ప్రఫుల్‌కుమార్ పండా

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్కిల్ నైపుణ్యం పెంపొందించి పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని సెంచూరియన్ యూనివర్శిటీ డీన్ ప్రఫుల్‌కుమార్ పండా తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో యూనివర్శిటీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. అనంతరం ప్రఫుల్‌కుమార్ పండా మాట్లాడుతూ ఉద్యోగాలు, వ్యాపారాలకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యా సంబంధమైన సమస్యలు, ఉద్యోగ నియామకాల గురించి వివరించారు. స్మార్ట్ వ్యవసాయం, పశువైద్యం, ఫార్మసీ,నర్సింగ్, ఇంజనీరింగ్‌తోపాటు వివిధవిభాగాలకు చెందిన కోర్సుల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్లేస్‌మెంట్ డీన్ కామేశ్వరం వివిధ కంపెనీలు, ఉద్యోగాల విషయాలను వివరించారు. విద్యార్థులకు చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం, క్రమశిక్షణ వంటి అంశాలను కూడా బోధిస్తున్నామని తెలిపారు. తమ యూనివర్శిటీలో చదువుకున్నవిద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు.తమ వర్సిటీలో 23 రాష్ట్రాలతో పాటు, విదేశీ విద్యార్థులు కూడా అభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్ వేణుగోపాల్, చంద్రకాంతరెడ్డి, లింగరాజు మహాపాత్రో, ఫల్గుణరావు పాల్గొన్నారు.

జీవో- 117 రద్దు చేయాలి: ఎమ్మెల్సీ

గుజరాతీపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవో- 117 రద్దు చేయాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. ఆదివారం శ్రీకాకుళంలోఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంజరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, మునిసిపల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లాఅధ్యక్షుడు మజ్జిమదన్మోహన్, ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘువర్మ

ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు రాష్ట్రంలోని వివిధ వేదికల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటి ద్వితీయస్థానాలు కైవశం చేసుకున్నారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో రాష్ట్రస్థాయి అండర్-19 బాలుర హ్యాండ్‌బాల్, అనంతపురంలో జరిగిన ఫుట్‌బాల్ బాలుర పోటీల్లో ద్వితీయస్థానం సాధించారు. ఈ పోటీలకు కోచ్, మేనేజర్లుగా గోపిక,ఈశ్వరరావు, ఆర్.సతీష్‌రాయు, గణపతి, శ్రీనులు వ్యవహరించారు.ఈమేరకు సత్తాచాటిన క్రీడాకారులకు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్యసలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీరమణ అభినందించారు.

జాతీయస్థాయిలో సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు..

జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటారు. కర్నూలు జిల్లా నంద్యాలలో ఈనెల ఆరు నుంచి పదో తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో బాలురు తృతీయస్థానం సాధించారు. ఈమేరకు రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు మెట్ట అఖిల్, యతిరాజులు లక్ష్మీప్రసాద్, మొదలవలస యశ్వంత్ (కేశవరావుపేట), సింహాద్రి (ఇప్పిలి) పాల్గొన్నారు. వీరికి జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కలిదిండి నరసింహారాజు, కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కె.వెంకటరమరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.రమణ, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, సభ్యులు జి.మల్లేష్, పి.వెంకటరమణ తదితరులు అభినందించారు.



హ్యాండ్‌బాల్‌లో ద్వితీయస్థానం సాధించిన జిల్లా క్రీడాకారులు

ఆల్ ఇండియా ర్యాకింగ్ టోర్నీకి శాన్వీ అర్హత

పాతపట్నానికి చెందిన లట్టాలశాన్వీ ఆల్‌ఇండియా ర్యాంకింగ్‌టోర్నమెంట్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. అసోంలోని డిబ్రూగర్‌లో ఈనెల 24 నుంచి జరుగుతున్న అండర్-13 ఆల్‌ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అసోం క్రీడాకారిణి తనిష్క్‌పై విజయం సాధించింది. తొమ్మిదేళ్ల శాన్వీ ఆడుతున్న మొదటిఅండర్-13 ర్యాంకింగ్ టోర్నమెంట్‌లోఉత్తమనైపుణ్యం ప్రదర్శించడంతో మ్యాచ్ పాయింట్ చైర్మన్, హెడ్‌కోచ్ వేణు ముప్పాల, అంతర్జాతీయ క్రీడాకారులు జేబీఎస్ విద్యాధర్, బీవీఎస్‌కే లింగేశ్వరరావు, ఇంటర్నేషనల్ ఎంపైర్ సంపతిరావు సూరిబాబు, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ తదితరులు అభినందించారు.

విద్యార్థులకు అభినందన

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్‌లోని విద్యార్థులను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం అభినందించారు.ముంబై రంగోత్సవ సెలబ్రేషన్స్‌లో లాఫింగ్ క్లబ్ విద్యార్థులు పలుపతకాలు సాధించారు.ఈ సందర్భంగా బాలల్లో ప్రతిభ, మెలకువలు వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, దీప్తి, నటుకుల మోహన్, పర్యాటక అధికారి నారాయణరావు, గుత్తు చిన్నారావు, నక్కశంకరరావు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

పొందూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పొందూరులోని వాంద్రంగి, కొండక, బత్తులవీధుల్లో రోడ్లు, కాలువలు నిర్మాణానికి టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఈవో మోహన్ బాబు ఆదివారం శంకుస్థాపనచేశారు కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ఎ.చినరంగ, తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి శంకరభాస్కర్, గిరి పాల్గొన్నారు.

పుస్తక పరిచయ సభ

సోంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాసీ సంఘ భవనంలో హెచ్ఆర్ఎఫ్ సభ్యురాలు కె.అనురాధ సోంపేట థర్మల్ ఉద్యమంపై రాసిన మన బీలకోసం - బతుకు కోసం పుస్తకం పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పట్లో జరిగిన ఉద్యమస్మృతులు నెమరు వేసుకొనేలా పుస్తకం ఉందని తెలిపారు.కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణసమితి అధ్యక్షుడు వైకృష్ణమూర్తి, బార్ల సుందరరావు, నెయ్యల విజయ్, బొర్ర రంగనాథం, ఉత్తరాల వెంకన్న, వైశ్యరాజు నాగు, బి.శంకర్ పాల్గొన్నారు.

వైద్యంకోసం ఆర్థిక సాయం

కవిటి,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టివానిపాలేం గ్రామానికి చెందిన చీకటి మదన్ రక్తసమస్యతో బాధపడుతుండడంతో గ్రామస్థులు, భానమ్మ శ్రీరాములయ్య ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ.1,69,600 జనసేన నాయకుడు శమళ్ళ ప్రసాద్ ఆధ్వర్యంలో బాలుడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

వైద్యురాలికి బెస్ట్ రీసెర్చర్ అవార్డు

అరసవల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికిచెందిన దంతవైద్యురాలు తంగి సౌజన్యకు ఇంటర్నేషనల్ బెస్ట్ రీసెర్చర్ అవార్డు లభించింది. ఈ మేరకు తమిళనాడు విద్యాశాఖ మంత్రి అంబిల్ మహేష్ చెన్నైలో అవార్డు అందజేశారు. ఆసియా రీసెర్చ్ అవార్డు-2024లో ఆమె ప్రచురించిన జర్నల్‌కు అవార్డు లభించింది.

బిల్లులు కాక.. పనులు జరగక

- పంచాయతీ భవనంలో కార్యకలాపాలు
- ఇదీ శాలిహుండం గ్రామ సచివాలయం భవనం దుస్థితి



అర్ధాంతరంగా నిలిచిపోయిన శాలిహుండం సచివాలయం భవనం

గార, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలిహుండం కొండపక్కన నిర్మిస్తున్న గ్రామసచివాలయం భవనానికి సంబంధించిన బిల్లులు కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. గతప్రభుత్వహయాంలో ఇక్కడ సచివాలయం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.40లక్షలు నిధులతో భవనం నిర్మాణం చేపట్టారు. అయితే కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం తదితర కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈభవనం నిర్మాణం పూర్తి కాకపోవడంతో పాత పంచాయతీ భవనం సచివాలయం నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయం నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయం భవనం పూర్తి చేయడానికి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మండల ఇంజనీరింగ్ అధికారి పి.గోవిందరావు తెలిపారు.

రూ.లక్షల వ్యయం..లక్ష్యం దూరం

- బూర్జలో నిరుపయోగంగా మరుగుదొడ్లు



పిచ్చిమొక్కల మధ్య ఉన్న మరుగుదొడ్లు

బూర్జ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బూర్జ ఎస్సీ వీధిలో నిర్మించిన 30 మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. టీడీపీ హయాంలో మలవిసర్జనరహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో లక్షలాదిరూపాయల వ్యయంతోగ్రామంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అయితే ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోయింది. నిర్వహణ లోపం వల్ల ప్రస్తుతం మరుగుదొడ్లు చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు చెత్త పేరుకుపోయింది. ప్రధానంగా నీటి సదుపాయం కల్పించకపోవడంతో వాటిని గ్రామస్థులు వినియోగించుకోవడానికి వీలు లేకుండాపోయింది. కాగా మరుగుదొడ్లు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామని ఎంపీడీవో తిరుపతిరావు తెలిపారు.

విద్యుత్ చార్జీల భారం తగదు

ఆమదాలవలస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు విద్యుత్‌సర్దుబాటు చార్జీలు పేరుతో ఆరు వేల కోట్ల చార్జీల భారం మోపడం తగదని వైసీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తనకు అధికారం ఇస్తే విద్యుత్ చార్జీలు పెంచమని ఊదరగొట్టిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే మాట మార్చి పెంచుకోవడానికి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు.

నౌపడలో అ'పూర్వ' కలయిక

సంతబొమ్మాళి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నౌపడ ప్రభుత్వ పాఠశాలలో 1982- 83 సంవత్సరంలో చదువుకున్న పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నేటి యోగక్షేమాలను ఒకరికొకరు తెలుపుకున్నారు. నాటి ఉపాధ్యాయులు చెన్నూరు విజయానందరాజు, రామముని కృష్ణారావు శర్మలను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొమ్మాళి రవికుమార్, లోపింటి రాజశేఖర్, గిరిధర్, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆక్రమణల చెరలో విశ్రాంతి భవనం

● వేచి ఉండేందుకు ప్రయాణికుల అవస్థలు

జలుమూరు, అక్టోబరు 27: (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కూడలి.. నాలుగు రోడ్లకు సెంటర్ పాయింట్. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. ఇక్కడ దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి భవనం (బస్ షెల్టర్)ను తన ఎంపీ నిధులతో నిర్మించారు.

ఆ తరువాత ప్రయాణికులు అక్కడ వేచి ఉండి బస్సులు రాగానే వెళుతుండేవారు. అయితే పలువురు వ్యాపారుల కళ్లు ఈ షెల్టర్‌పై పడ్డాయి.. అంతే తడవుగా బడ్డీలను ఏర్పాటుచేయగా మరికొంత భాగంలో ఏఎంసీ వారు వారి అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఎండ, వానల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరి చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు షెల్టర్ కల్పించాలని కోరుతున్నారు.



చల్లవానిపేట కూడలిలో ఆక్రమణలకు గురైన ప్రయాణికుల విశ్రాంతి భవనం

టీడీపీ నాయకుడిపై వైసీపీ నేత దాడి

వజ్రపుకొత్తూరు,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డోకులపాడు మాజీ సర్పంచ్, టీడీపీ మండల నాయ కుడు అంబటి రామకృష్ణపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయ కుడు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు యంపల్ల పాపారావు ఆదివారం దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ ఎం.నీహాల్ అందించిన వివరాలిలా ఉన్నాయి.. ఇటీవల గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామసంఘ భవనంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామపెద్దలతో పాటు మాజీ సర్పంచ్ రామకృష్ణ, వైసీపీ నాయకుడు యంపల్ల పాపారావు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకార భరోసా ఎంపికలో లబ్ధిదారుల నుంచి వసూళ్లపై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని సంఘానికి జమ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పాపారావు మనసులో పెట్టుకున్నారు. డోకులపాడు నుంచి గంగాధరపల్లికి కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన తారురోడ్డు పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రామానికి సమీపంలో ఉన్న తనతోట నుంచి తిరిగి వస్తూ రోడ్డు పనులను పరిశీలిస్తున్న రామకృష్ణపై పాపారావు దాడిచేశారు. ద్విచక్ర వాహనంపై ఉన్న రామకృష్ణ ను కిందకు లాగి చేతులతో గుద్ది గాయపరిచారు. అన్ని విషయాల్లో దూరవద్దని పాపారావు హెచ్చరించినట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన రామకృష్ణను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్ఐ నీహాల్ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుడి నుంచి వివరాలు సేకరించారు. ఈ మేకు వైసీపీ నేత పాపారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. దాడి విషయం తెలుసుకున్న మండల పార్టీ నేతలు సూరాడ మోహన రావు, జి.వసంతరావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, అర్స వెల్లి ఉమామహేశ్వరరావు, రెయ్య నాగార్జున రాపాక శాంతారావు పరామర్శించారు. దాడిని తీవ్రంగా ఖండించారు.


రామకృష్ణను పరామర్శిస్తున్న టీడీపీ మండల నేతలు

రాజకీయ కక్షలు విడనాడాలి: ఏఎస్పీ

పోలాకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామంలో రాజకీయ కక్షలు వీడి రాజీమార్గంలో నడవాలని ఏఎస్పీ (క్రైమ్) శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం వనవిష్ణుపురంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో ఇటీవల రాజకీయ కక్షలతో పాలిన వీరాస్వామి నిండు ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తంచేశారు. వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య కొట్లాట నేపథ్యంలో శాంతి కమిటీని ఏర్పాటుచేశామన్నారు. ఈ కమిటీలో సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఎస్ఐ రంజిత్‌కుమార్ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శాంతి కమిటీని నియమించి గ్రామంలో పలు సూచనలు చేశారు. రాజకీయ కక్షలు విడనాడతామని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామపెద్ద పాలిన ప్రసాదరావు పాల్గొన్నారు. వనవిష్ణుపురంలో పోలీస్ పికెట్ కొనసాగుతోందని ఎస్ఐ తెలిపారు.

భక్తిభావాలను పెంపొందించుకోవాలి

జలుమూరు (సారవకోట) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావాలను పెంపొందించుకోవాలని టెక్కలి ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం దివ్య జీవన సంఘం అధ్యక్షుడు నరసింహస్వామి అన్నారు. బుడితి గ్రామంలో ఆదివారం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలతోనే మానవ మనుగడ ముందుకెళుతుందన్నారు. ప్రస్తుత కాలంలో మన హిందూ సాంప్రదాయాలను విదేశీయులు ఆచరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అల్లు రామయ్య, మెండ సన్యాసిరావు, అప్పలరాజు, సోమేశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన నందెన్న ఉత్సవాలు

నరసన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీపురంలో నందెన్న నిమజ్జనం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలతో ఊరేగింపు చేపట్టారు. శివ పార్వతులు నృత్యాలు, ఆంజనేయస్వామి వేషాలతో పాటు రాక్షస సంహారం వంటి ఘట్టాలు ఆకట్టుకున్నాయి. భవానీపురం, చిత్రవీధి, బొడ్డవలస, స్టేట్‌బ్యాంకు వీధి , బజారువీధి తదితర వీధుల్లో ఊరేగింపు నిర్వహించి గోరువాని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భవానీపురం యువజన సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

● కేంద్రమంత్రిని కోరిన ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు ఆదివారం రాత్రి శ్రీకాకుళం ప్రజాసదన్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఉర్లాం, తిలారు రైల్వేస్టేషన్‌ల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని, తిలారు వద్ద నిర్మిస్తున్న రైలు అండ్ రోడ్డు వంతెన పనులకు న్యాయపరమైన అడ్డంకులు తొలగించేలా చర్యలు తీసుకోవాలనికోరారు. నియోజకవర్గంలో యువత నైపుణ్యాలు పెంపుదించేందుకు కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చే ఒక సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు.


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పోలాకి/జలుమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలాకి, జలుమూరు మండ లాల్లో పలువురు అనారోగ్య బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. పోలాకి మండల ఈదుల వలస కు చెందిన కొండక వెంకటేష్‌కు రూ.62,470, జలుమూరు మండలం అల్లాడ గ్రామానికి చెందిన మొజ్జాడ కృష్ణవేణికి రూ.50 వేలు మంజూరు కాగా వారికి చెక్కులను మబగాం, కత్తెరవాని పేట కార్యాలయాల్లో అందించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై యాప్ భారం తగ్గించాలి

నందిగాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై యాప్, ఆన్‌లైన్ భారం తగ్గించి బోధనకు అవకాశం ఇవ్వాలని యూటీఎఫ్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం నందిగాం ఉన్నతపాఠశాల ఆవరణలో యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, జిల్లా సహాధ్యక్షుడు కె.దాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ బి.చిట్టిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వి.సింహాచలం, పి.ధర్మారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు, టి.వైకుంఠరావు, పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న యూటీఎఫ్ నేతలు

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

యూటీఎఫ్ మండలశాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షు డిగా కె.ధర్మారావు, అధ్యక్షుడిగా కె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా వై.గణపతి రావు, సహాధ్యక్షులుగా టి.వేణు, ఎం.బాలామణి, కోశాధికారిగా కె.బాపూజీ తదితరులను ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పు చట్ట విరుద్ధం

కాశీబుగ్గ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల్లో ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరణ చేసుకోవచ్చని కోర్టు తీర్పు ఇవ్వడం చట్టవిరుద్ధమని, దీనిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం దారుణమని మాజీ ఎంపీ హర్షకుమార్, ఐడీఏఎస్ విశ్రాంత ఉద్యోగి పీఎస్ఎస్ మూర్తి, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్ అన్నారు. ఆదివారం కాశీబుగ్గ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా హక్కుల సాధన కోసం అవగాహన సదస్సు నిర్వ హించారు. యువత ముందుకు వచ్చి భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. అంతకు ముందు కాశీబుగ్గ పాతబస్టాప్ వద్ద డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పిల్ల కృష్ణారావు, మట్ట జీవన్, పి.ప్రకాష్, టి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న హర్షకుమార్ తదితరులు

పల్లెలకు రోటరీ సేవలను విస్తరించాలి


108 సిబ్బందిని సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

హరిపురం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు రోటరీ సేవలను విస్తరించేలా కృషి చేయాలని హరిపురం కోస్టల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య అన్నారు. హరిపురం సామాజిక ఆసుపత్రి వద్ద రోగులు వేచి ఉండేందుకు గాను సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. ప్రతి నెల ఒక్కో సేవా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అనంతరం కరోనా సమయంలో ఎంతో సమయస్ఫూర్తిగా వ్యవహరించి సేవలందించిన 108 సిబ్బంది మురళీమోహన్, గోపాలకృష్ణ, శంకర్, రామ చంద్ర, సంత్యంలను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు వైఎస్ఎన్ మూర్తి, ఎం.లక్ష్మణరావు, కొర్ల కన్నారావు, ప్రదీప్, దశరథ, పుల్లా వాసు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

కోటబొమ్మాళి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత ఇసుక పంపిణీ విధానంపై కొత్తపల్లి గ్రామంలో పార్టీ నేతలు హర్షం వ్యక్తంచేవారు. ఈ మేరకు ఆది వారం గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా సిమ్మ సింహాచలం, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ.. గడ చిన ఐదేళ్లుగా వైసీపీ ప్రభు త్వ విధానాల వల్ల ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని, ప్రస్తుతం పేదలకు అందుబాటులో ఇసుక విధానం వల్ల ఎంతో మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

క్రైం కార్నర్

5.2 కిలోల గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంద్రపేట సమీపంలో ఆదివారం 5.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. పట్టణంలోని కంద్రపేట వద్ద ఉన్న శ్మశాన వాటికలో నిషేధిత వస్తువులతో వ్యక్తులు ఉన్నట్లు ఆమదాలవలస ఎస్ఐ వెంక టేష్‌కు సమాచారం తెలిసింది. ఆ సమయంలో ఆయన అక్కడకు చేరుకొగా నలుగురు వ్యక్తులను గుర్తించారు. కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన షేక్ అరిఫ్, పర్లాకిమిడికి చెందిన సాగిపల్లి చరణ్‌లో పాటు మరో మైనర్ బాలుడుతో కలిసి గంజాయిని పంపకాలు చేసుకుం టున్నారు. ఆ సమయంలో వీరితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఉండగా పోలీసులకు దొరక్కుండా పారిపోయారు. వారిని పట్టుకొనేందుకు ప్రయత్నం చేస్తున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు. వీరికి పర్లాకిమిడి నుంచి కొంతమంది వ్యక్తుల నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతోంది. సమావేశంలో సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆమదాలవలస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస గ్రామానికి చెందిన గరుగుబిల్లి లచ్చన్న (18) ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, స్థానికుల కథనం మేరకు.. తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లచ్చన్న చదువుతున్నాడు. చెడు వ్యసనాలకులోనై తల్లిదం డ్రులు మాట పెడ చెవిన పెడుతూ చదువు దృష్టిసారించడం లేదు. ఈనేపథ్యంలో లచ్చన్నను తల్లిదండ్రులు మందలించారు. దీనితో లచ్చన్న శనివారం ఆ గ్రామం శివారులో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈమేరక కేసు నమోదు చేశారు.

తొమ్మిది మంది కోడి పందెంరాయుళ్లు అరెస్టు

రణస్థలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీలంపేట గ్రామానికి సమీపంలో గల ఓ పొలంలో తొమ్మిది మంది కోడి పందెంరాయుళ్లను జేఆర్‌పురం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం కోడి పందేలు జరుగుతున్నాయని ముందస్తు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ 32 వేలు నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, తొమ్మిది పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

టెక్కలి, అక్టోబరు 27(ఆంధ్రజోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో శనివారం రాత్రి పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడిచేసినట్లు ఎస్ఐ రఘునందనరావు తెలిపారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.48వేలు నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పుస్తెలతాడు చోరీ

పోలాకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బెలమర గ్రామానికి చెందిన పొట్నూరు రత్నం మెడలో ఉన్న పుస్తెలతాడు చోరీ జరిగిందని ఎస్ఐ రంజిత్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చోరీ చేసిన వ్యక్తులు పిన్నింటిపేట మీదుగా వనవిష్ణుపురం గ్రామంవైపు వెళ్లిపోయారని.. వెంబడించినా దొరకలేదన్నారు. బాధితురాలు రత్నం తోటి మహిళలతో కలిసి రోజూ వాకింగ్ చేస్తుంటారు. ఎప్పటిలాగే శనివారం సాయంత్రం వాకింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి తులంన్నర పుస్తెలతాడు లాక్కుపోయారు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మాజీ మంత్రి అప్పలరాజు హౌస్ అరెస్ట్

● ఆయన నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత


పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

పలాస, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో ఆయన నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ-వైసీపీ నాయకుల పరస్పర దాడుల నేపథ్యంలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ వద్ద భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. రెండు రోజుల కిందట ఓ బాలిక, ఆమె తల్లిపై టీడీపీ నాయకులు దాడి చేశారనే ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నట్లు అప్పలరాజు ప్రకటించారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి ఇరు పార్టీల నేతల మధ్య స్టేషన్ ఆవరణలో ఘర్షణ జరిగినవ విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఘర్షణలు జరగవచ్చనే ముందస్తు సమాచారంతో అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం 10 గంటల నుంచి మాజీ మంత్రి నివాసానికి వైసీపీ నాయకులు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అప్పలరాజు ఇంటి బయటకు రాగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు తెలిపారు. దీంతో అప్పలరాజు వారితో వాగ్వాదం చేశారు. వైసీపీ కార్యకర్తలు ప్రభుత్వానికి, పోలీసులకు, ఎమ్మెల్యే శిరీషకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయనను ఇంటిలోకి పంపడంతో వివాదం సద్దు మణిగింది. ఇదిలా ఉండగా నిందితులపై పోక్సో కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ.. స్టేషన్‌లోనే దాడులు చేసిన వారిపై హత్యాయత్నం కేసులు పెట్టాలని కోరారు.

అధికార లాంఛనాలతో సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు అంత్యక్రియలు


గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) శ్రీను (ఫైల్)

కోటబొమ్మాళి అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎత్తురాళ్లపాడు గ్రామానికి చెందిన ఎండ శ్రీను (28) మహారాష్ట్రలో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురై ఈనెల 25న మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి తీసుకువచ్చి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. త్రినాథ రావు, డిల్లెమ్మలకు శ్రీను మొదటి సంతానం. కాగా మరో సోదరుడు నవీన్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. శ్రీను ఎనిమిదేళ్ల కిందట సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధుల్లో చేరాడు. సెలవులకు గ్రామానికి వచ్చినప్పుడల్లా గ్రామస్థులతో స్నేహ భావంతో మెలిగి అందరి ఆదరణను పొందేవాడు. తల్లిదండ్రులు శ్రీనుకి వివాహం చేసేందుకు సంబంధాలను చూస్తున్నారు. అయితే ఈ తరుణంలో మృతిచెందడంతో కుటుంబంతో పాటు బంధుమిత్రులు ఆవేదనకు గురయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహంపై జాతీయ జెండాను కప్పి పోలీ సులు మూడు సార్లు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు.

ఇంటర్వ్యూ

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ

● ఎంపీడీవో శ్రీనివాసరావు



ఎల్.ఎన్.పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉంటుందని, పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రశ్న: పనులను ఎలాంటి సమయంలో పర్యవేక్షిస్తారు?

జవాబు: గ్రామాల్లో పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పర్యవేక్షిస్తాం.

ప్ర: మండల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు తీసుకుంటారు?

జ: మండలం అభివృద్ధి జరగాలంటే అన్ని శాఖల అధికారులు సహక రించాల్సి ఉంటుంది. వారితో పాటు ప్రజాప్రతినిధుల ప్రతిపాదనల మేరకు ప్రణాళికలను తయారు చేస్తాం.

ప్ర: అభివృద్ధి పనులపై వివాదాలు వస్తే ఎటువంటి చర్యలు చేపడతారు?

జ: గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. పనులు జరిగే సమయంలో వివాదాలు వస్తే సంబంధిత జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

పోలాకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా సామగ్రి విక్రయాలకు అనుమతి తప్పనిసరని సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్ తెలిపారు. ఆదివారం వారు పలు గ్రామాల్లో పర్యటించి వ్యాపారులకు హెచ్చరికలు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పోలాకి మండలంలో నాలుగు దుకాణాలకు అనుమతి కావాలని దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రియాగ్రహారం, పిన్నింటిపేట, డీఎల్‌పురం, పోలాకి, బెలమర జంక్షన్ వద్ద స్థలాలను పరిశీలించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు నరసన్నపేట, పలాస జట్లు

నరసన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. నరసన్నపేట వైఎంసీఏ, పలాస జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో వైఎంసీఏ ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, నిర్వాహకులు వీవీఎస్ మూర్తి, శ్రీకాకుళం సత్యసేవా సమితి ఆర్గనైజర్స్ శశి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మెయిన్ లైన్ మార్పు

సంతబొమ్మాళి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సూరాడవానిపేట గ్రామంలో విద్యుత్ లైన్‌ను విద్యుత్ అధికారులు ఆదివారం మార్పు చేశారు. గతంలో వేసిన విద్యుత్ లైన్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, సూరాడ రాయుడు మంత్రి అచ్చె న్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఆదేశాలతో విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ ఆధ్వర్యంలో కొత్త లైన్ ఏర్పాటు చేశారు.

మహాసభలు జయప్రదం చేయండి

హిరమండలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సీపీఎం 18వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. నవంబరు 9,10 తేదీలలో పలాసలో నిర్వహించనున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.అప్పారావు, పి.కృష్ణ పాల్గొన్నారు.

శ్రీకాకుళానికి షణ్ముఖ్ మృతదేహం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద శనివారం కారు టైర్ పేలి, లారీని ఢీకొన్న ప్రమాదంలో మరణించిన ఇస్కాన్ భక్తుడు షణ్ముఖ్ దేహాన్ని స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా మందస మండలం బహడపల్లికి ప్రత్యేక అంబులెన్స్‌లో తర లించారు. ప్రమాదంలో మొత్తం ఆరుగురు దుర్మరణం చెందారు. ఇస్కాన్ భక్తులు తాడిపత్రిలోని ఓ ఇంట్లో శనివారం శ్రీకృష్ణ సంకీర్తన ముగించుకుని అనంతపురం వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలకు ఆదివారం ఉదయం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భౌతికకాయాలను ఇస్కాన్ భక్తుల సందర్శనార్థం నగర శివారులోని ఇస్కాన్ మందిరానికి తరలించారు. మృతుల బంధువులతోపాటు వందలాదిమంది ఇస్కాన్ మందిరానికి చేరుకుని తుదివీడ్కోలు పలికారు. షణ్ముఖ్ మృతదేహాన్ని పహడ్‌పల్లికి తరలించారు. మృతదేహాన్ని చూసి తండ్రి సాంబమూర్తి కన్నీటి పర్యంత మయ్యారు.

ఘనంగా అంబలం పూజ

నందిగాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొండ్రాయివలసలో అయ్యప్ప స్వామి అంబలంపూజ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆరంగి రామారావు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప శరణుఘోషతో గ్రామం మారుమోగింది.